పరిశోధనారంగంలో మహిళలకు తగిన ప్రాధాన్యం లభించడం లేదనుకుంటున్న తరుణంలో వైద్యశాస్త్రంలో తాను చేసిన పరిశోధనకు అంతర్జాతీయ అవార్డు పొంది మన దేశ ప్రతిష్ఠను నిలబెట్టారు డాక్టర్ రోయా. పర్షియా నుంచి వచ్చి హైదరాబాదులో స్థిరపడిన రోయా వైద్యవిద్యను ఇక్కడే అభ్యసించారు. ఇక్కడి వ్యక్తినే పెళ్లాడి భారతీయ సంప్రదాయాలకు అలవాటుపడ్డారు. ఇటీవల ప్రేగ్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో రాయన్ అంతర్జాతీయ అవార్డు అందుకుని వచ్చిన ఆమె తన గురించి, తన పరిశోధనల గురించి 'వసుంధర'కు వివరించారు.

# ఇది నా అదృష్టం



మహిళలు తల్లి కాలేకపోవడానికి, ఇతరత్రా పలు సమస్యలకు ఎండోమెట్రియోసిస్ కారణమని ప్రపంచవ్యాప్తంగా జరిగిన పలు పరిశోధనలు పేర్కొన్నాయి. అయితే హైదరాబాద్‌లోని మహావీర్ ఆసుపత్రి, మెటర్నల్ హెల్త్ అండ్ ఫెర్టిలిటీ సెంటర్‌కు చెందిన డాక్టర్ రోయా రోజాటీ బృందం స్త్రీలు గర్భం ధరించలేకపోవడానికి ఎండోమెట్రియోసిస్, క్రమరహిత రుతుప్రవాహం, జన్యుపరమైన లోపాలతో పాటు పలు ఇతర అంశాలూ కారణమవుతాయని తాజాగా కనుగొంది. 800 మందిలో పరిశోధనలు నిర్వహించి ఈ ఫలితాలను వెల్లడించింది. ఈ అంశంపై ఆమె చేసిన విశిష్ట పరిశోధనకు గుర్తింపుగా ఏడో రాయన్ అంతర్జాతీయ పరిశోధనా అవార్డు అందుకున్నారామె. ఈ కార్యక్రమంలో ప్రపంచవ్యాప్తంగా పాల్గొన్న 48 మంది ప్రతినిధుల్లో ఆమె ఒకరు.

పర్షియన్ అయిన రోయా 1980లో భారత్ వచ్చారు. వైద్య విద్య ఇక్కడే పూర్తిచేశారు. లండన్‌లోని రాయల్ కాలేజీనుంచి ఎం.ఆర్.సి.ఓ.జి., ఎఫ్.ఆర్.సి.ఓ.జి. పట్టాలు అందుకున్నారు. యుకెలోని రాయల్ సమారిటన్ ఆసుపత్రిలో కొన్నాళ్లు పనిచేసి వచ్చి ఢిల్లీ ఎయిమ్స్, హైదరాబాద్ నిమ్స్‌లలోనూ సేవలందించారు. ప్రస్తుతం ఒక ప్రైవేట్ హాస్పిటల్ అండ్ రిసెర్చ్ సెంటర్‌లో ప్రొఫెసర్‌గా, స్త్రీవ్యాధులు, ప్రసూతి సేవల విభాగానికి అధిపతిగా పనిచేస్తున్నారు. ఆరేళ్ల క్రితం సొంతంగా మెటర్నల్ హెల్త్ అండ్ రిసెర్చ్ సెంటర్ ప్రారంభించారు.

కుటుంబం విషయానికొస్తే... హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ ధర్మరక్ష్‌తో నా వివాహమైంది. ఇద్దరబ్బాయిలు. ఎనిమిది, పది తరగతులు చదువుతున్నారు. నేను కొద్దిగా తెలుగు మాట్లాడగలుగుతున్నాను. ఇడ్లీ, వడ, ఉప్మా, దోశ వంటి టిఫిన్లతోపాటు కొన్ని తెలుగు వంటకాలు కూడా బాగానే చేయగలను.' అంటూ నవ్వుతూ చెబుతారామె. ఇప్పటివరకు ఎన్నో అవార్డులు, పత్రాలు పొందినా ప్రేగ్‌లో అంతర్జాతీయ పరిశోధనా అవార్డు అందుకోవడం చాలా ఆనందం కలిగించిందన్నారు రోయా. 'నా పరిశోధన ఇంతటితో ఆగదు... ఇంకా కొనసాగుతూనే ఉంటుంది. మరో విషయం తెలుసా... నేను ఈ అవార్డు అందుకోవడానికి బిడ్డతో కలిసే వెళ్లాను. దేశానికి పేరొచ్చేంత సేవ చేయాలన్నదే నా ఆకాంక్ష' అంటూ నవ్వుతూ చెబుతారు డాక్టర్ రోయా.

### పరిశోధనలు...

- ✿ వీర్యకణాల పనితీరులో జింక్ పాత్ర, ప్రభావాల గురించి పరిశోధన
- ✿ ఒలిగోస్పెర్మిక్ పురుషుల్లో జన్యుపరమైన లోపాలు, పర్యావరణ ఈస్ట్రోజెన్‌లు, క్రమరహిత రుతుప్రవాహం... తదితర పరిశోధనలు.
- ✿ పలు సమావేశాల్లో పాల్గొని పరిశోధనాపత్రాలను సమర్పించిన ఆమె వ్యాసాలు దేశవిదేశాల్లోని వైద్యపత్రికల్లో ప్రచురితమయ్యాయి.

### అవార్డులు

- ✿ ఢిల్లీకి చెందిన గ్లోబల్ ఎకనమిక్ కౌన్సిల్ నుంచి రాష్ట్రీయ రత్న అవార్డు
- ✿ 1998లో బెంగుళూరులో రాజీవ్‌గాంధీ శిరోమణి పురస్కారం
- ✿ 2000లో వైద్యప్రముఖులకు ఇచ్చే బల్లం శ్రీనిధి విశిష్ట పురస్కారంతో పాటు పలు అవార్డులు, పత్రాలు